## క్లుప్తంగా

### అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు



**శాయంపేట:** మండలంలో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ఇటుక బట్టీల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బీఎస్‌ఎస్ అధ్యక్షుడు సుమన్, అంబేద్కర్ విద్యార్థి సమాఖ్య జిల్లా కన్వీనర్ పవన్‌కళ్యాణ్ కోరారు. ఈ మేరకు జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా మండల పరిధిలోని చెరువులు, కుంటల్లో జేసీబీతో నల్లమట్టిని తోడుతూ ఇటుక బట్టీలకు ఉపయోగిస్తున్నారని వినతిలో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న బట్టి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

### క్రీడాకారుడికి అభినందన

**కమలాపూర్:** హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన 5వ తెలంగాణ రాష్ట్ర తైక్వాండో చాంపియన్ షిప్–2023 సబ్ జూనియర్ విభాగంలో కమలాపూర్‌కు చెందిన బాలసాని ప్రిన్స్ విఘ్నేశ్వర్ సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా గౌడ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) హనుమకొండ జిల్లా ప్రతినిధులు మంగళవారం అభినందించారు. 2023 ప్రతిభ పురస్కారాల కార్యక్రమంలో భాగంగా అభినందించి మెమొంటో, మెడల్ అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాడి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రవికుమార్‌గౌడ్, గోపా రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌బాబుగౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చిర్రా రాజుగౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణగౌడ్, డాక్టర్ నేరెళ్ల గౌడ్, విచందర్‌గౌడ్, క్రీడల యువజన శాఖ అధికారి బుర్ర సునీతాగౌడ్, ప్రొఫెసర్ సాయన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ఐకమత్యం ఉండాలి

**దుగ్గొండి :** రాజకీయాలకు అతీతంగా ఐక్యతతో ఉంటేనే ముదిరాజ్ కులస్తుల అభివృద్ధి సాధ్యమవుతుందని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సంఘం ముఖ్యనాయకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పేద ముదిరాజ్ కుటుంబాలకు సంఘం అండగా నిలుస్తుందని చెప్పారు. ఐక్యంగా ఉంటూ హక్కుల సాధన కోసం ఉద్యమించడానికి సిద్ధం కావాలని సూచించారు. అన్ని గ్రామాల్లో ముదిరాజ్, యూత్, మహిళా కమిటీలను ఈనెల 28లోగా పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో ముదిరాజ్ మహాసభ ఎన్నారై విభాగం రాష్ట్ర కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, పల్లె రమేశ్, ముత్యాల స్వామి, ఓరుగంటి తిరుపతి, రామన్న, జటబోయిన ప్రభాకర్, మంద భిక్షపతి, ఈర్ల రమేశ్, నరేశ్, కీసరి మొగిలి, రవి, మంద రాజు, గంగాధర్, దండు నర్సయ్య, గొర్రె కొమ్మాలు పాల్గొన్నారు.

### రాగిజావ పంపిణీ

**ధర్మసాగర్(వేలేరు):** దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. వేలేరు పాఠశాలలో అటెండర్ అంకుశావలీ కృషితో ఏర్పాటు చేసిన వివరాల పెట్టెను తెరవడంతో రూ. 10 వేలు జమా అయ్యాయని తెలిపారు. ఆ డబ్బును తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల కోసం ఉపయోగించనున్నట్లు వెల్లడించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు స్థానిక సర్పంచ్‌లు రాగిజావా, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ శ్రీనివాస్, ఎస్‌ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### పశుగ్రాసం దగ్ధం



**ఎల్కతుర్తి:** పశుగ్రాసం తరలిస్తుండగా ప్రమాదవశత్తు అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ సంఘటన మండలంలోని కోతులనడుమ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన ఎర్రోళ్ళ పోచయ్య మూడు ట్రాక్టర్లలో పశుగ్రాసం, పైపులను తరలిస్తున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పశుగ్రాసం, పైపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. సుమారు రూ. 80వేల వరకు నష్టపోయానని బాధితుడు వాపోయారు.

### నేడు కేయూలో యోగా డే

**కేయూ క్యాంపస్ :** యూనివర్సిటీ యోగా సెంటర్, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఈనెల 21(నేడు) ఉదయం 7 గంటలకు క్యాంపస్‌లోని స్పోర్ట్స్ బోర్డు ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు యోగా సెంటర్ డైరెక్టర్ జ్యోతి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఈసం నారాయణ మంగళవారం తెలిపారు.

# విద్యారంగానికి మొదటి ప్రాధాన్యం



ఐనవోలులో..



ఆత్మకూరులో..



దామెరలో..

**శాయంపేట:** విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇస్తుందని వరంగల్ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన విద్యా దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండలంలోని గట్లకానిపర్తి, హుసెన్‌పల్లి, తహరాపూర్ గ్రామాల్లో చేపట్టిన వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గట్లకానిపర్తి ప్రభుత్వ పాఠశాలలో రూ. 12లక్షల 60వేల జెడ్పీ నిధులతో నిర్మించిన అధనపు తరగతి గదులను, డిజిటల్ క్లాస్ రూమ్స్, ఐఎఫ్పి ప్యానెల్స్ ప్రారంభించారు. అలాగే హుస్సేన్‌పల్లిలో మన ఊరు మనబడి కార్యక్రమం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను, కేజీబీవీలో ఇంటర్మీడియట్ తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గండ్ర జ్యోతి మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం సీఎం కేసీఆర్ విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. నిరుపేద విద్యార్థులకు చదువు భారం కాకుండా 1001 ప్రభుత్వ గురుకుల పాఠశాలలను ప్రారంభించారని వెల్లడించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, నోట్‌బుక్కులు అందించారు. అలాగే ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వైస్‌ఎంపీపీ రాంశెట్టి లతాలక్ష్మారెడ్డి, సర్పంచ్‌లు రవి, సాంబయ్య, శ్రీనివాస్, రజిత, ఎంపీటీసీలు చంద్రప్రకాశ్, రజిని, జీసీఈ సునీత, స్పెషల్ ఆఫీసర్ మాధవి, హెచ్‌ఎం బండారి మధు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదే విధంగా మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో రంగవల్లిలు, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుభాషిని దేవి, లలిత, పైదా, మమత, సిబ్బంది, పాల్గొన్నారు.

**పరకాల:** తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన పోటీలలో విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ బహుమతులు ప్రధానం చేశారు. విద్యార్థులు, అధ్యాపకుల రంగవళ్లులు ఆకట్టుకున్నాయి. అలాగే వెల్లంపల్లి ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ దశాబ్ధి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులకు యూనిఫాంలు, పుస్తకాలను విద్యాకమిటీ చైర్మన్ సుమన్, ప్రధానోపాధ్యాయుడు బుచ్చిరెడ్డిలు అందించారు.

**ఎల్కతుర్తి:** కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిన ఘటన సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎంపీపీ మేకల స్వప్న అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మన ఊరు మన బడి కింద ప్రభుత్వం అందజేసిన ఎల్ఈడీ టీవీలను పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మికు మంగళవారం ఆమె అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీఠ వేస్తుందని, కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల్లో విద్యా, మౌళిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఆంగ్లబోధన ప్రవేశపెట్టి ఉన్నత విద్యను అందించడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులకు కావల్సిన యూనిఫాం, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు వెల్లడించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అలాగే భీమదేవరపల్లి, ఎలకతుర్తి ప్రభుత్వ పాఠశాలల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు విద్యా దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్‌పీపీ నగేష్, ఎంపీడీవో సునీత, సర్పంచ్ నిరంజన్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజు, ఎంపీవో రవి, ఎంఈవో రవీందర్, పంచాయితీ కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**ధర్మసాగర్:** విద్యార్థినిలకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పింస్తుందని సర్పంచ్ సమ్మక్క అన్నారు. మండలంలోని ముప్పారం కేజీబీవీలో మంగళవారం విద్యా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మాధవితో కలిసి ఆమె విద్యార్థినులతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం మన ఊరు–మన బడి పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. విద్యార్థిని, విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ రాజు, ఉపాధ్యాయునులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



శాయంపేట: కేజీబీవీ అదనపు గదులను ప్రారంభిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ గండ్ర జ్యోతి

**కమలాపూర్:** తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కమలాపూర్ మండల వ్యాప్తంగా మంగళవారం విద్యా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు జాతీయ జెండాలు ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. గతేడాది వార్షిక పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించి వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ సాంబయ్య, ఎంపీటీసీ లక్ష్మరవీందర్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఎస్‌ఎంసీ చైర్మన్ స్వప్న, హెచ్‌ఎం ప్రభావతి, ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, ఎస్ఎస్ఎస్ పీఓ రాజ్‌కుమార్, దాతలు జయప్రకాష్, వెంకన్న, సదయ్య, సమ్మయ్య, న్యాయవాది కళాధర్, శేఖర్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఐనవోలు:** ప్రభుత్వ పాఠశాలల్లోనే అన్ని వసతులు ఉన్నాయని ఎంపీపీ మధుమతి అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా, మైనారిటీ గురుకులాల్లో విద్యా దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఎంపీపీ మార్నేని మధుమతి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం మనఊరు మనబడి ద్వారా అభివృద్ధి చేసిందన్నారు.

**ఆత్మకూరు:** తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన విద్యా దినోత్సవం మండల వ్యాప్తంగా మంగళవారం ఘనంగా జరిగింది. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో డిజిటల్ క్లాస్ రూం, లైబ్రరీని జెడ్పీటీసీ రాధిక ప్రారంభించారు. అలాగే తిరుమలగిరిలోని కేజీబీవీలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం నిర్మలకుమారి, లక్ష్మణ్‌రావు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ వాసవి, ఉప సర్పంచ్ స్వాతి, భగవాన్‌రెడ్డి, ఉపాధ్యాయులు సురేందర్, శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

**దామెర:** సర్కారు బడుల్లోనే మెరుగైన విద్య లభిస్తుందని ఎంపీపీ కాగితాల శంకర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో గల మైనారిటీ గురుకుల పాఠశాలలో మంగళవారం విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, కేసీఆర్ కిట్లు పంపిణీ చేసి ఎసెస్సీలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గరిగె కల్పన, వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, ఎంపీడీఓ రవీందర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాము, సర్పంచ్ సరోజన, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పరకాలలో..



ఎల్కతుర్తిలో..



ధర్మసాగర్‌లో..



కమలాపూర్‌లో..

### కార్యకర్తలకు అండగా ఉంటాం



**ఐనవోలు:** కార్యకర్తలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన బరిగల రాజేష్ మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కాగా బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం ఉండటంతో పార్టీ ఇన్సూరెన్స్ కింద మంజూరైన రూ.2లక్షల చెక్కును మృతుడి తండ్రి యాదయ్యకు మంగళవారం అందించారు. పార్టీ కోసం పనిచేసే ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. రోడ్డు ప్రమాదంలో రాజేష్ మృతిచెందడం దురదృష్టకరమని అన్నారు. రాజేష్ కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీపీ మార్నేని మధుమతి, మండల పార్టీ అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, సర్పంచ్ జన్ను కుమారస్వామి, కో ఆప్షన్ సభ్యుడు గుంశావలి, ఎంపీటీసీ కల్పన, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

### కుట్టు మిషన్‌ల పంపిణీ

**రాయపర్తి :** మహిళల ఆర్థికాభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్ తెలిపారు. మండలంలోని కొత్తూరులో కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంగళవారం వారు కుట్టుమిషన్లు పంపిణీ చేసి మాట్లాడారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చొరవతో కుట్టుమిషన్ల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ పరిశీలకురాలు పంజా కల్పన, ఎంఈఓ రంగయ్య, సర్పంచ్ కందికట్ల స్వామి, ఎంపీటీసీ కందికట్ల రాధమ్మ రాజయ్య, మందాటి సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మహిళలకు ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్లు

**గీసుకొండ :** జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీగా గుర్తింపు పొందిన మండలంలోని మరియపురం గ్రామ మహిళల కోసం ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్లు అందుబాటులో ఉంచినట్లు సర్పంచ్ అల్లం బాలిరెడ్డి తెలిపారు. గ్రామంలోని 300 మంది మహిళల కోసం తన సొంత ఖర్చుతో కొనుగోలు చేసి అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే గ్రామంలోని హైస్కూల్ విద్యార్థినులకు కూడా ఉచితంగా అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ఒక్కరు శానిటరీ న్యాప్‌కిన్లు ఉపయోగించాలన్నారు. కొనాయమాకులలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నీరటి సుభాషిణి, గాలి కోమలత, కత్తి రమ సెర్ప్ స్త్రీశక్తి జాయింట్ లయబిలిటీ గ్రూప్‌గా ఏర్పడి తయారు చేస్తున్న షీ కేర్ శానిటరీ 1200 న్యాప్‌కిన్లను బాలిరెడ్డి కొనుగోలు చేసి వారికి సహాయకారిగా నిలిచారు. ప్రతినెలా మొదటి వారంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ మహిళలు అవసరమైన న్యాప్‌కిన్లను పంచాయతీ కార్యదర్శి నుంచి తీసుకోవచ్చని ఆయన చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నల్లెల స్వప్న, వార్డు సభ్యులు, పాల్గొన్నారు.

### కేసీఆర్, ఎర్రబెల్లి చిత్రపటాలకు క్షీరాభిషేకం

**రాయపర్తి :** కాంట్రాక్ట్ లెక్చరర్‌లను రెగ్యులరైజ్ చేయడాన్ని హర్షిస్తూ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎం కేసీఆర్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చిత్రపటానికి లెక్చరర్లు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం కళాశాల టాపర్లుగా నిలిచిన అర్చన, ఎం.సత్య, కల్పన, అఖిల్, జావేద్, రజితలను సన్మానించారు. సర్పంచ్ నర్సయ్య, ఎంపీటీసీ రాంచందర్, అధ్యాపకులు విజయకుమారి, నవీన్‌కుమార్, రాజు, రాజిరెడ్డి, గీత, సోమయ్య, నాగరాజు, ప్రభాకర్, శ్రీనివాస్, ఉపేంద్రచారి, రాజేందర్ పాల్గొన్నారు.

# రోడ్డెక్కిన మహిళలు

**శాయంపేట:** మండల కేంద్రంలోని 8, 9వార్డుల్లో నివసిస్తున్న ప్రజలకు 15 రోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో మంగళవారం ఖాళీ బిందెలతో మహిళలు రోడ్డెక్కారు. అంతటితో ఆగకుండా ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడారు. గల 15రోజులుగా తాగునీరు సరఫరా నిలిపోయిందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఓట్ల కోసం ఇంటికి వచ్చి దండం పెట్టిన నాయకులు ఇప్పుడు నీళ్ల కోసం అడిగితే పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు చొరువ తీసుకొని సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళలు నీల ఇంద్ర, గొట్టిముక్కుల సరోజన, దుబాసి స్వరూప, దిండిగాల మానస, గొట్టిముక్కుల సునీత, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.





ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మహిళలు

# ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**దామెర:** ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు ఏర్పచుకొని ఉంటున్న నిరుపేదలకు పట్టాలు పంపిణీ చేయాలని ప్రజాసంఘాల ఐక్యవేధిక జిల్లా నాయకులు బొట్ల చక్రపాణి, తిరుపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణకు వినతిపత్రం అందించారు. మండలంలోని ముస్త్యాలపల్లి శివారులో గల ఎస్సారెస్పీ కాలువ పక్కన నిరుపేదలు గుడిసెలు ఏర్పచుకొని జీవనం కొనసాగిస్తున్నారు, వారికి పట్టాలు అందించాలని డిమాండ్ చేశారు. జీఓ 58, 59 ప్రకారం ఇళ్ల స్థలాలు క్రమబద్ధీకరించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చని పక్షంలో కలెక్టరేట్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. నేడు జరిగే బస్సుయాత్రను జయప్రదం చేయాలని ఆయన కోరారు. అలాగే చేతి వృత్తిదారులకు అందించే ఆర్థిక సాయం దరఖాస్తు గడువును జూలై 21వ తేదీ వరకు పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంపత్, రాజు, రమేష్, ప్రతాప్, గణేష్, మధు, దివాస్, జన్ను వంశీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు ఫీజులను నియంత్రించాలి

**విద్యారణ్యపురి :** ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీపై డీఈఓ తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్‌ఎఫ్‌ఐ) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ డీఈఓ కార్యాలయం ఏసీజీ చలిపతిరావుకు వినతిపత్రంను సమర్పించారు. ఈ సందర్భంగా యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మాలోతు రాజేష్ మాట్లాడుతూ జిల్లాల్లో ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వీటిని నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో యూఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి హరీష్,సహాయ కార్యదర్శి శ్రీనాథ్, నాయకులు ప్రశాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ఏసీజీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

# రాష్ట్రంలో విద్యా వ్యవస్థ బలోపేతం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య.

**కేయూ క్యాంపస్:** తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యవస్థ బలోపేతం అవుతుందని నూతన విద్యా విధానం సంస్కరణలు అమలులోకి వస్తున్నాయని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్నఅయిలయ్య అన్నారు. మంగళవారం హనుమకొండలోని సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాలలో ఎంబీఏ విభాగంలో నిర్వహించిన విద్యా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యా బోధనలో ఈ–తరగతి విధానం అమలులోకి వచ్చిందన్నారు. కేవలం విద్యార్థులకు తరగతిగదికే పరిమితం కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలు, మానవీయ విలువలను పెంపొందించటం లాంటి కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆయన వెల్లడించారు.

# విద్యతోనే అభివృద్ధి సాధ్యం

**హన్మకొండ అర్బన్ :** విద్యతోనే అభివృద్ధి సాధ్యమని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ అనితారెడ్డి అన్నారు. హెల్పింగ్ సొసైటీ, రన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పేద విద్యార్థులు, మల్లికాంబ మనోవికాస కేంద్ర దివ్యాంగులు, ఒయాసిస్ అనాథ పిల్లలు, స్పందన ఆశ్రమంలోని మూగ, చెవిటి పిల్లలకు ఉచితంగా నోట్‌బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ పిల్లలు చదువుతో పాటు మంచి నడవడికతో ఎదగాలని కోరారు. కార్యక్రమంలో రన్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు శార్వాణి ప్రియాంక, శ్రీకాంత్, ఆశ్రమాల ప్రతినిధులు రామలీల, సుచరిత, చంద్రప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందిస్తున్న అనితారెడ్డి

### ప్రభుత్వ కళాశాలల సందర్శన

**ఖిలా వరంగల్:** మండల పరిధిలోని రంగశాయిపేట, ఖిలావరంగల్ ప్రాంతంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలను న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జె.ఉపేందర్‌రావు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని టాయిలెట్స్, తరగతి గదులు, ఫ్యాన్స్, టేబుల్స్‌ను పరిశీలించారు. విద్యార్థులు కనీస సౌకర్యాలు లేకుండా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గమనించి, అసంతృప్తి వ్యక్తం చేశారు. సరైన సౌకర్యాలు, వసతులు శుభ్రంగా లేక ఇబ్బంది పడుతున్నారని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. కళాశాలలోని ప్రతి సమస్యను పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందని సూచించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట కళాశాల ప్రిన్స్‌పాల్ శోభాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.